దేవీ శరన్నవరాత్రులకు
శంకరమఠం ముస్తాబు

అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు



నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు శ్రీశారదా శరన్నవ రాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకై అవసర మైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.. ఇందులో భాగంగా మఠం ప్రాంగణంలో గల శక్తి గణపతి, చంద్రమౌళీశ్వరస్వామి, శారదాంబ ఆలయాలకు రంగులు అద్ది, విద్యుత్ దీపాలతో అలంకరిస్తు న్నారు. అలాగే మఠం ఆవరణలో రంగు రంగుల ముగ్గులతో పాటు భక్తుల కోసం ఆకర్షణీయమైన స్వాగత తోరణాలు, చలువ పందిళ్లు కూడా ఏర్పాటు చేయిస్తున్నారు.

◆ మంగళవారం శంకరమఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కె. కృష్ణారావు 'సాక్షి'తో మాట్లాడుతూ.. శ్రీ శారదా శరన్నవరాత్రి ఉత్సవ వివరాలను వెల్లడించారు. శారదా శరన్నవరాత్రి ఉత్సవాల్లో శారదాంబ వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా క్యూ లైన్ల ఏర్పాటు, తాగు నీటి వసతి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

◆ నవరాత్రి ఉత్సవాల ప్రారంభానికి ముందు రోజు బుధవారం(2న) ఉదయం 6 గంటలకు శారదాంబకు మహాభిషేకం, 9 గంటల నుంచి 10.30 గంటల వరకు మూలవిరాట్ హరిద్రా దర్శనం ఉంటుందని కృష్ణారావు చెప్పారు. అనంతరం శారదాంబ జగత్ ప్రసూతిక అలంకారములో భక్తులకు దర్శనమిస్తుందని తెలిపారు.

నవరాత్రుల్లో అమ్మవారి అలంకరణ వివరాలు

- 02న శారదాంబ మేలవిరాట్‌కు మహాభిషేకం, జగత్ ప్రసూతి అలంకారం
- 03న బ్రాహ్మి అలంకరణ, కలశ స్థాపన ఉంటుంది.
- 04న మహేశ్వరి
- 05న కౌమారిగా
- 06న వైష్ణవి అలంకరణ, సహస్రమోదక గణపతి హోమం
- 07న ఇంద్రాణి అలంకరణ
- 08న గజలక్ష్మీ అలంకరణ
- 09న సరస్వతి అలకంరణ, మూలా నక్షత్రం
- 10న దుర్గాష్టమి, దుర్గ అలంకారం
- 11న మహార్నవమి, రాజరాజేశ్వరి అలంకారం – చండీహోమం, పూర్ణాహుతి ఉంటుంది.
- 12న కామదేను అలంకారం, విజయ దశిమి వేడుకలు.
- సాయంత్రం 6 గంటలకు శాంకరి నాట్యస్థల్ గురువు విజయవల్లి భరద్వాజ్ శిష్య బృందంచే సంగీత నృత్య సేవ ఉంటుంది.

ప్రతి రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు

- 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు అద్వైతసిద్ధి రత్నాకర్త శాస్త్రనిధి బ్రహ్మశ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యంచే దేవీ భాగవతము ప్రవచనాలు ఉంటాయి.
- 3వ తేదీ సాయంత్రం 5 గంటలకు శృంగేరి ఆస్థాన విద్వాంసుడు వేణు గోపాల్ బృందంచే నాదస్వరం, 7 గంటలకు జొన్నలగడ్డ శ్రీరామ్ బృందంచే కర్ణాటక గాత్ర కచేరి



- 04న సాయంత్రం 7 గంటలకు డాక్టర్ కె.శేషలత బృందంఏ బృందంచే 'కర్ణాటక గాత్ర కచేరి'
- 05న సాయంత్రం 7 గంటలకు ఆలిండియా రేడియో కళాకారుడు డీవీ. మోహన కృష్ణ బృందంచే కర్ణాటక గాత్ర కచేరి
- 06న ఉదయం 10 గంటలకు సుధాస్వామి బృందంచే 'సౌందర్య లహరి పారాయణ', సాయంత్రం 7 గంటలకు జగద్గురు శ్రీ విద్యాశంకర మహాస్వామి రచించిన 'శ్రీ కనకదుర్గానందలహరి స్తోత్రం కీర్తనము', 8 గంటలకు కుమారి సాయి శరవణ శ్రేయ పన్నాలచే 'గాయత్రి దరువు' కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుంది.
- 07న సాయంత్రం 7 గంటలకు గీతా గణేశన్‌చే యూసీపీఏ విద్యార్థుల నృత్యాంజలి ఉంటుంది.
- 08న సాయంత్రం 7 గంటలకు కొమరవోలు శివప్రసాద్ బృందంచే గళ మురళీ విన్యాసం (ఈల పాట సంగీతం)
- 09న సాయంత్రం 7 గంటలకు వైనిక చక్రవర్తి డి. శ్రీనివాస్ బృందంచే వీణా వాద్య కచేరి ఉంటుంది.
- 10న సాయంత్రం 7 గంటలకు లక్ష్మీ ప్రసన్న నాట్య కల్ప స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ స్కూల్ విద్యార్థులచే 'నవదేవి వైభవము'



కూచిపూడి నృత్య సేవ

- 10న సాయంత్రం 6 గంటలకు 'లయ కళా విపంచి' పెరావని జయభాస్కర్ బృందంచే ''స్వరలయసుధ సర్వవాద్య సమ్మేళనం''
- 3వ తేదీ నుండి 11వ తేదీ వరకు సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు కొండూరి పద్మావతి బృందంచే 'సౌందర్యలహరి పారాయణం' ఉంటుంది.
- 17న సాయంత్రం 6 గంటలకు జయప్రద రాంమూర్తి బృందంచే 'వేణు వాద్య కచేరి' ఉంటుంది.

27న శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకు గోరక్ష మహా పాదయాత్ర

కాచిగూడ: అఖిల భారత గోసేవ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ నెల 27న శ్రీనగర్‌లోని శ్రీశంకరాచార్య దేవాలయం నుంచి మహాపాదయాత్ర ప్రారంభమై జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, న్యూఢిల్లీ, హరియాణా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మీదుగా కన్యాకుమారి వరకు 27 మార్చి 2025 వరకు చేరుకుంటుందని లవ్ ఫర్ కౌవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జస్మత్ పటేల్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కాచిగూడ లోని ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గోరక్షణ కోసం బాలకృష్ణ గురుస్వామి చేస్తున్న మహా పాదయాత్రకు ప్రతి ఒక్కరూ మద్దతు ప్రకటించి తమవంతుగా సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. గోవును రక్షిస్తేనే భారత దేశం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉంటుందని ఆయన తెలిపారు. గో రక్ష మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆక్యుపంక్చర్ వైద్యానికి కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్రంలో ఆక్యుపంక్చర్ వైద్యానికి కౌన్సిల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆక్యుపంక్చర్ ఆక్యుప్రెషర్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.సుధీర్, ప్రధానకార్యదర్శి డాక్టర్ పిఎస్ సాగర్, కోశాధికారి జి.సుభాష్ ప్రభుత్వాన్ని కోరారు. అసోసియేషన్ సమావేశంలో తీసుకున్న తీర్మానాలను వివరిస్తూ ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం ఓ ప్రకటనలో వారు విజ్ఞప్తి చేశారు. భారత ప్రభుత్వం ఐసీఎంఆర్, డీహెచ్ఆర్ నేతృత్వంలోని స్టాండింగ్ కమిటీ 2018లో అక్యుపంక్చర్ వైద్యాన్ని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థగా ఆమోదించిందని, అదే విధంగా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అక్యుపంక్చర్ వైద్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ఈ వైద్య విధానాన్ని ఆమోదించాయని, అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. దేశంలో ఈ అక్పుపంక్చర్ వైద్యాన్ని విస్తృతం చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ రాకేష్ జైస్వాల్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ త్రివిక్రమ్, టి.అనిల్ కుమార్, ఎస్.రవీందర్, జె.పురుషోత్తం, అనిరుద్, అభిషేక్, ఆర్.సత్యం తదితరులు పాల్గొన్నారు.

మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవం ఎన్నిక

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.వెంకటేశం తెలిపారు. అధ్యక్షుడిగా కె.జమలయ్య, ప్రధానకార్యదర్శిగా బి.వెంకటేశం, గౌరవ సలహాదారులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, గౌరవ అధ్యక్షులుగా ఏఐటీయూసీ జాతీయ నాయకులు వీఎస్ బోస్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎండి ఇమ్రాన్, ఉపాధ్యక్షులుగా ఎండి ఓమర్ ఖాన్, ఏ.బిక్షపతి, ఉప ప్రధాన కార్యదర్శిగా మోహన్‌రావు, సహాయ కార్యదర్శులుగా బత్తుల సత్యనారాయణ, బి.తిరుమలేష్ గౌడ్, జి.వెంకటేష్, సిహెచ్ జంగయ్య, టి.రాములు, కె.చందు యాదవ్, బి.రాజు గౌడ్, పి.నర్సిరెడ్డి, కోశాధికారిగా ఎస్.అశోక్ తో పాటు మరో 30 మందిని రాష్ట్ర సమితి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నారాయణగూడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో బి.వెంకటేశంను యూనియన్ నేతలు, కార్మికులు ఘనంగా సత్కరించి అభినందించారు.

పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సమంజసం కాదు

ముషీరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగింపు సమంజసం కాదని హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ పూర్వాధ్యకులు, వాసవి సేవా కేంద్రం పూర్వాధ్యకులు, శ్రీ కాసన గోట్టు రాజశేఖర్‌గుప్తా అన్నారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ పిలుపు మేరకు మంగళవారం ఉదయం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వేణిశెట్టి సుధాకట్‌గుప్తా, వి.సత్యవర్ధన్, పి.కృష్ణమూర్తి, ఏ.ఆంజనేయులు, ఎర్రం శేఖర్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ప్రకాష్, ఎలక్ట్రికల్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం సమంజసం కాదన్నారు. ఈ విషయమై అసెంబ్లీలో చర్చిస్తామని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

హైడ్రాతో పేదలపై దాడులు సరికాదు

సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సూర్యం

ముషీరాబాద్: హైడ్రాతో పేదలపై దాడులు సరి కాదని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం అన్నారు. హైదరాబాద్ నగరంలో చెరువులు, కుంటలు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోనల్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చి వేయడానికి హైడ్రాను ఏర్పాటు చేసినట్లు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెబుతుందన్నారు. ఇప్పటికే హైడ్రాతో హైదరాబాద్ లోని అనేక ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలను నేలమట్టం చేసిందన్నారు.

◆ ప్రభుత్వాల, అధికారుల అండతో ప్రభుత్వ, ప్రైవేటు భూదందాలు జరిగాయని వీరి మోసానికి గురై మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాలు ప్లాట్లు కొనుగోలు చేసుకున్నాయన్నారు. నేడు వీరు బలి అవుతున్నారని భూదందాల నుంచి మోసానికి గురైన ఇటువంటి వర్గాల ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు. ముందుగానే ప్రత్యామ్నాయం కల్పించాలని అయితే అదే సందర్భంలో ఎన్నో ఏళ్లుగా జీవనోపాధి కోసం పేద ప్రజల పెట్టుకున్న చిన్న షాపునలను, వారు నివసిస్తున్న చిన్న ఇళ్లను కూడా కూల్చి వేస్తున్నారన్నారు.

◆ ప్రభుత్వం ఈ రకంగా పేద ప్రజలు నివాసముంటున్న ఇండ్లు, వారికి జీవన ఉపాధి కల్పిస్తున్నటువంటి చిన్న షాపులపై దాడులకు దిగడం దుర్మార్గమైందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పేద ప్రజలందరికి పక్కా ఇండ్లు కట్టించేలా చర్యలు చేపట్టాలన్నారు. మోసపోయిన వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలని పేద, మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పేరుతో పేదలకు అన్యాయం చేయొద్దు



గోల్నాక లంకబస్తీల్లో బాధితులతో కలిసి ధర్నాలో కార్పొరేటర్ దూసరి లావణ్య

అంబర్‌పేట: ముప్పై ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లను మూసీ అభివృద్ధి పేరిట హైడ్రా సంస్థతో తొలగిస్తామని చేస్తున్న ప్రకటనలను పేదలను తీవ్ర భయందోళనకు గురవతున్నారని గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గోల్నాక డివిజన్లో మూసీ పరీవాహక ప్రాంతం అయిన కృష్ణనగర్, లంకబస్తీలు, దుర్గానగర్, ప్రాంతాల్లో నిర్మాణాలను తొలగిస్తామంటు ఇప్పటికే మార్కింగ్ చేశారు. గత నెల రోజులుగా వందలాదిమంది పేద నివాసితులు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారని అన్నారు. బాధితులతో కలిసి కార్పొరేటర్ స్థానిక బస్తీల్లో పెద్ద ఎత్తున మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పైసా పైసా ఏళ్ల తరబడి కష్టపడి నివాసం ఏర్పరుచుకుంటే అన్యాయంగా కూల్చవద్దని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. గోల్నాక డివిజన్‌లో హైడ్రా చేపట్టే చర్యలకు బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అభివృద్ధికి తాము అడ్డు కాకుండా పేదలకు అన్యాయం జరిగితే మాత్రం వారి తరుపున పోరాడినందుకు సిద్ధం అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్, ఇతర బీఆర్ఎస్ నాయకులు, బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్ జీజేఎల్ఏ అధ్యక్షుడిగా ప్రసాదరావు



కాచిగూడ: హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (జీజేఎల్ఏ) అధ్యక్షుడిగా కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ లెక్చరర్ వి.ప్రసాదరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం కాచిగూడలోని కళాశాలలో వి.ప్రసాదరావును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి, తోటి లెక్చరర్స్ ఘనంగా సత్కరించి అభినందించారు.

28న బీసీ మహాధర్నా

పంజగుట్ట: రాష్ట్రంలో వెంటనే సమగ్ర కులగణన చేసి బీసీ రిజర్వేషన్లు పెంచి పెంచిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత తీసుకురావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీల హక్కుల సాధనకు ఉద్యమ పంథా మార్చాలని మిలిటెంట్ ఉద్యమం తరహాలో ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన కల్వకుర్తి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద నిర్వహించనున్న బీసీ మహాధర్నా కరపత్రాన్ని, జెండాను మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆర్.కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్, కరీంనగర్ మాజీ జెడ్పీటీసీ తుల ఉమ, బీసి మహాసభ వ్యవస్థాపకులు కొమ్ము శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు.

స్నూకర్ అండ్ బిలియర్డ్ విజేతగా ముస్తాక్ ఖాన్

కాచిగూడ: బషీర్‌బాగ్‌లోని బిలియర్డ్ స్నూకర్ అకాడమీ ఆధ్వర్యంలో స్నూకర్ అండ్ బిలియర్డ్ 2024 తెలంగాణ రాష్ట్ర చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 15వ రెడ్ విన్నర్‌గా ముస్తాక్ ఖాన్, రన్నర్‌గా టి.సాయి నిలిచారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు నవీన్ గౌడ్, తెలంగాణ క్యూ స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ అప్పారావులు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అభిలాష్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

నిద్రలేమి, మానసిక ఒత్తిడితో అల్జీమర్స్

- డా.హిప్నో పద్మాకమాలకర్
- రామకృష్ణ మఠంలో మతిమరుపు వ్యాధి అంశంపై ఉపన్యాస పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

కవాడిగూడ: మసకబారుతున్న జ్ఞాపకాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రొగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా. హిప్నో పద్మాకమాలకర్ అన్నారు. మంగళవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని రామకృష్ణ మఠంలోని బాలల సేవా విభాగంలో నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్జీమర్స్ (మతిమరుపు) వ్యాధి అనే అంశంపై ఉపన్యాసపోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వాచీలు, పుస్తకాలను బహుమతులుగా అందజేశారు.

◆ ఈ సందర్భంగా డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ మాట్లాడుతూ... అల్జీమర్స్ డేను జరుపుకోవడం వల్ల ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెరుగుతుందన్నారు. సాధారణంగా ఈ వ్యాధి వృద్ధాప్యంలో కనిపించేదని ఇప్పుడు విద్యార్థుల్లో ఎక్కువగా పెరిగిపోతోందన్నారు. ప్రశాంతమైన నిద్రలేకపోవడం, మానసిక ఒత్తిడితో ఈ వ్యాధి తీవ్రత పెరుగుతుందన్నారు. పౌష్టికాహారం, వ్యాయామం, కొత్త విషయాలు నేర్చుకోవడం, పుస్తకాలు చదవడం వైపు దృష్టి మరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు రఘునందన్ మహారాజ్, స్వరూపారాణి, శోభారాణి, హారతి తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ పోర్న్‌పై సుప్రీంకోర్టు నిర్ణయం చరిత్రాత్మకం

తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి



దోమలగూడలోని జేఏసీ కార్యాలయంలో మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు

కవాడిగూడ: చైల్డ్ పోర్న్‌పై దేశ సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు నిర్ణయం సరైన సమయంలో తీసుకోవడం చరిత్రాత్మకం అని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం దోమలగూడలోని న్యాయవాదులజేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పులిగారి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ సమస్య ప్రపంచ వ్యాప్తంగా తల్లిదండ్రులను మానసికంగా వేధిస్తుందన్నారు.

◆ 2012వ సంవత్సరంలో పోక్సో చట్టాన్ని సుప్రీంకోర్టు తీసుకువచ్చిందని దీనితో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి లైంగిక విద్యపై పోక్సో చట్టంలోని నిబంధనలపై పాఠశాల స్థాయినుంచే అవగాహన కల్పించాలని, విస్తృత స్థాయిలో చైతన్యపరిచే కార్యక్రమాలను చేపట్టాలని సుప్రీం కోర్టు సూచించింది కానీ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలం అయ్యారని పేర్కొన్నారు.

◆ పసిపిల్లలు, స్కూల్లకెళ్లే చిన్నారులపై లైంగిక అకృత్యాలు, ఈ తరహా అమానుష చర్యలకు ప్రేరేపిస్తున్న, మూలకారణం అవుతున్న దుర్వేసనాలకు అడ్డుకట్టవేసే దిశగా కేంద్ర ప్రభుత్వం పోక్సో చట్టంలో సవరణలను తేవాల్సిన అనివార్యత ఉందన్నారు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు విస్తృత ప్రచార మాధ్యమాల ద్వారా లైంగిక నేరాలపై ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కె. రాజిరెడ్డి, సూర్యప్రకాష్, జి చంద్రశేఖర్‌రెడ్డి, నాగేశ్వర్, రమేష్, నోముల కృష్ణాగౌడ్ కె. కొండల్‌రెడ్డి, జి. సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి కళాకారుల ప్రదర్శన

నృత్య సమ్మేళనం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో వేదాంతం పార్వతీశం 104వ జయంతిని పురస్కరించుకొని కూచిపూడి నృత్య గురువుల సమ్మేళనం విశేషంగా ఆకట్టుకుంది. మంగళవారం సాయంత్రం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో నిర్వహించిన సమ్మేళనంలో నృత్య గురువు డా.వేదాంతం వెంకటాచలపతి మాట్లాడుతూ.. కూచిపూడి నృత్య పతాక రూపకర్త వేదాంతం పార్వతీశం జయంతి రోజు నృత్య సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. డా. చలపతిశాస్త్రీ, మృత్యుంజయశర్మ, సత్యప్రసాద్, సేతురాం, డా.సుమిత్ర, రామలింగేశ్వర శాస్త్రీ, రమణసిద్ధి, ఇందిరా పరాశరం పాల్గొన్నారు.

యువ శక్తి దేశ నిర్మాణానికి ఎంతో ముఖ్యం

ఎన్ఎస్ఎస్ ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ పల్లవి

చిక్కడపల్లి: ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డే సందర్భంగా వివిధ కళాశాలకు సంబంధించిన వెయ్యి మంది విద్యార్థులు మంగళవారం చిక్కడపల్లిలోని కేంద్ర గ్రంథాలయంతో పాటు మరో 10 శాఖా గ్రంథాలయాలల్లో స్వచ్ఛతా కార్యక్రమాన్ని చేపట్టారు. నగర గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ కదిరావన్ ఆదేశాల మేరకు నగర కేంద్ర గ్రంథాలయం సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ పర్యవేక్షణ కార్యక్రమం జరిగింది. ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డే ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్ఎస్ఎస్ ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ పల్లవి మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ముందు ఉంటారని అన్నారు. యువ శక్తి దేశ నిర్మాణానికి ఎంతో ముఖ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ స్టేట్ ఆఫీసర్ నర్సింగ్‌గౌడ్, అన్నపూర్ణ, స్టేట్ ఎన్ఎస్ఎస్ అధికారులు, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చాగంటి అయోధ్య, కార్యదర్శి బొల్లం మహేందర్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్, పుస్తె సుకేశ్‌కుమార్, వరప్రసాద్, రామ్మోహన్, వెంకటేశ్వర్ రెడ్డి, అవినాశ్, మదన్‌మోహన్, గ్రేడ్–1 అధికారులు చంద్రకళ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.




గ్రంథాలయంలో సరస్వతిదేవీకి పూజ చేస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ పల్లవి, శుభ్రత చర్యల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు



ఘనంగా హెబ్రోన్ వ్యవస్థాపక దినోత్సవం



ప్రార్థనలు చేస్తున్న దైవసేవకులు జాన్‌సుబ్బారెడ్డి, కురియన్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు

చిక్కడపల్లి: గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లోని ప్రతిష్టాత్మకమైన హెబ్రోన్ చర్చి వ్యవస్థాపక దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న హెబ్రోన్ చర్చి బ్రాంచ్ నుంచి దైవసేవకులు సంఘం పెద్దలు వేలసంఖ్యలో హాజరై ప్రార్థనలు జరిపారు. సంఘం పెద్దలు బ్రదర్ వై.జాన్‌సుబ్బారెడ్డి, దైవసేవకులు జోసెప్ కురియన్ల ఆధ్వర్యంలో ప్రార్థనలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. సొసైటీ, ట్రస్ట్‌ల మధ్య నెలకొన్న విభేదాలు తొలగి కలసికట్టుగా హెబ్రోన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రేవంత్‌రెడ్డి పాలన విజయవంతంగా కొనసాగాలని చర్చిలో ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఇకపై ఎవరూ సొసైటీ, ట్రస్ట్ అని గొడవలు పడొద్దన్నారు. అందరం ఏకతాటిపై వచ్చి ముందుకు నడవాలన్నారు. రాగి వీరాచారి కబందహస్తాల నుంచి హెబ్రోన్ సేవకుల విమోచన జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు జేసీరావు, డి.రాజేశ్వర్‌రావు, జాన్‌స్టువర్ట్, అద్దంకి ఇమాన్యుల్, పీటర్ ప్రాన్సిల్, యేసుపాదం, సామెల్ జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కన్యాశుల్కం నాటకానికి సాహితీ లోకంలో ప్రత్యేక స్థానం



చిక్కడపల్లి: తెలుగు భాషలో విప్లవాత్మక మార్పులకు ఆద్యుడు, మహాకవి గురజాడ అప్పారావు అని రిటైర్డ్ న్యాయమూర్తి నాగ మారుతిశర్మ అన్నారు. మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో అభ్యుదయ కవి గురజాడ అప్పారావు యాదిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగ మారుతిశర్మ మాట్లాడుతూ... సాహిత్య వైతాళికుడని గురజాడ అప్పారావు అని అన్నారు. న్యాశుల్కం నాటకానికి సాహితీ లోకంలో ప్రత్యేక స్థానముందన్నారు. ప్రజలకు అర్థమయ్యే వాడుక భాషలో ఆయన రచనలు చేశారన్నారు. గానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్దనమూర్తి అధ్యక్షతన వహించిన కార్యక్రమంలో ప్రముఖులు శైలజామిత్ర, చక్రపాణి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నాన్‌పాస్టర్‌లు పాల్గొనడం దురదృష్టకరం

క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరూసలేం మత్తయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హెబ్రోన్ వ్యవస్థాపక దినోత్సవం పేరిట నిర్వహించిన ఏకపక్ష సమావేశంలో ట్రస్ట్ సభ్యులు, అనుకూల సేవకులతో పాటు నాన్ పాస్టర్‌లు, ఆంధ్ర రాయలసీమ ప్రాంతంలోని వారు మాత్రమే పాల్గొనడం దురదృష్టకరమని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షులు జెరూసలేం మత్తయ్య విమర్శించారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మెజార్టీ తెలంగాణ, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నిజమైన హెబ్రోన్ సొసైటీవారు పాల్గొనకపోవడం విచారకరమిని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు ప్రోద్బలంతో హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించి చట్టవ్యతిరేకంగా బాధ్యతలు చేపట్టిన ఎఫ్‌సీ పీటర్, జాన్ సుబ్బారెడ్డి వర్గం తమ ఆధిక్యతను చాటుకోవడానికి ప్రయత్నించారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో ట్రస్ట్ సభ్యులు హెబ్రోన్ చర్చిలోకి ప్రవేశించారని మాజీ ఎమ్మెల్సీ చెప్పడంతో వర్గపోరును ప్రోత్సహించినట్లు అయిందన్నారు. ఇట్టి విషయంపై తాము ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.